ప్రజాశక్తి

శనివారం 5 జులై 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

విద్యుత్ భారాలు, స్మార్ట్‌మీటర్లపై

జన పోరుబాట

- ఎపి సిపిడిసిఎల్ కార్యాలయం వద్ద సిపిఎం మహాధర్నా
- 50 వేల వినతులతో తరలివచ్చిన ప్రజలు
- విద్యుత్ కార్యాలయానికి తోరణాలుగా కట్టి నిరసన
- స్మార్ట్‌మీటర్లను తిప్పికొట్టండి : బాబూరావు



మహాధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



ఎపిసిపిడిసిఎల్ కార్యాలయం వద్ద వినతులను తోరణాలుగా అలంకరించిన ప్రజలు



ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ప్రజలను దోపిడీ చేసే స్మార్ట్‌మీటర్లను, విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పెంపును ప్రజలు తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీల రద్దు, స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా రమేష్ హాస్పిటల్ ఎదురుగా గల ఏపీసిపిడిసిఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం మహాధర్నా నిర్వహించారు. విద్యుత్ విధానంలో ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పది రోజుల నుంచి విజయవాడ మూడు నియోజకవర్గాల్లో సిపిఎం విస్తృత ప్రచారం నిర్వహించింది. దీంతో నగరం నలుమూలల నుంచి 50 వేల దరఖాస్తులతో వందలాది జనం మహాధర్నాకు తరలివచ్చి కార్యాలయ గోడలకు వినతులను వేలాడదీసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ ప్లకార్డులు ధరించి నినదించారు. మహిళలు విజ్ఞప్తులు మెడలో వేసుకుని నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయంలో దరఖాస్తులను తీసుకోవటానికి అధికారులు ముందుకు రాకపోవడంతో ప్రజలు, విద్యుత్ వినియోగదారులు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ధర్నానుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోడీ ఆదేశాలతో వైసిపి ప్రభుత్వం చేసుకున్న అక్రమ ఒప్పందాలను నేడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అదాని, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ వంటి సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను కూటమి సర్కార్ తూచా తప్పకుండా పాటిస్తూ స్మార్ట్ మీటర్లను బిగిస్తుందన్నారు. రాష్ట్రంలో బాగున్న రెండు కోట్ల మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ప్రీపెయిడ్ అదాని స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, రూ.25 వేల కోట్ల భారం ప్రజల నెత్తిన రుద్దుతున్నారని తెలిపారు. 93 నెలల్లో వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుండి మీటర్ వ్యయం వసూలు చేస్తున్నారని చెప్పారు. ప్రీపెయిడ్ పద్ధతిలో ముందుగానే బిల్లులు వసూలు చేసి ప్రజల నెత్తిన (మిగతా 2లో)

నగర వైభవాన్ని చాటిచెప్పేలా విజయవాడ ఉత్సవ్

- దసరా ఉత్సవాల సమయంలో నిర్వహణకు కసరత్తు
- ఎంపి కేశినేని శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఏటా శరన్నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతాయని, దసరా ఉత్సవాల సమయంలో విజయవాడ నగర వైభవాన్ని చాటిచెప్పేలా విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక, కళా వారసత్వాన్ని ప్రతిబింబించేలా విజయవాడ ఉత్సవ్ ఆలోచనకు కార్యరూపమిచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు .శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో విజయవాడ ఉత్సవ్‌పై జరిగిన ప్రాథమిక సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పాల్గొని ఉత్సవ నిర్వహణకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక వారసత్వ సంపదకు వన్నె తెచ్చేలా, పర్యాటకాన్ని ప్రోత్సహించేలా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. విజ్ఞానం, వినోదాన్ని మేళవించి ఏయే కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందనే దానిపై అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే లక్షలాది మంది యాత్రికులకు విజయవాడ నగర పర్యటన మధురానుభూతులు మిగిల్చేలా కార్యక్రమాలు నిర్వహించాలని చూస్తున్నట్లు తెలిపారు. హరిత బెరం పార్కు, పున్నమి ఘాట్, భవానీ ఐలాండ్, పవిత్ర సంగమం, తుమ్మలపల్లి కళాక్షేత్రం తదితర ప్రాంతాల్లో వైవిధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జానపద కళలను ప్రోత్సహించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఫుడ్ ఫెస్టలు, వాటర్ స్పోర్ట్స్, డ్రోన్ షో, లేజర్ షో, థీమ్ బ్యూటిఫికేషన్ వంటివాటిపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఎగ్జిబిషన్ సొసైటీకి పూర్వవైభవం తీసుకొచ్చేలా మెగా ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందరి సలహాలు సూచనలను పరిగణనలోకి తీసుకొని విజయవాడ ఫెస్ట్ నిర్వహణకు ముందుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్టాంపుల దొంగలు నలుగురు..!



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల చోరీ వ్యవహారంలో నలుగురి పాత్ర ఉందని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన చోరీలో రూ.13,56,300 విలువైన స్టాంపులు తోక బిళ్లల చోరీ వ్యవహారాన్ని చేధించడానికి క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. సబ్ రిజిస్టార్ కార్యాలయం ఎదురుగా రోడ్డు మీద ఉన్న సిసి ఫుటేజ్ రికార్డును సేకరించారు. చోరీ జరిగిన రోజు రాత్రి నలుగురు వ్యక్తులు హెల్మెట్లు ధరించి రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చినట్లుగా సిసి ఫుటేజ్‌లో కనిపించింది. స్రవంతి స్కూలు దగ్గరలో బైక్‌లను వదిలిపెట్టి నలుగురు వ్యక్తులు నడుచుకుంటూ రిజిస్ట్రార్ ఆఫీస్ లోపలికి వెళ్లారు. అయితే అంతకుముందు ఆ నలుగురిలో ఇద్దరు వ్యక్తులు రోడ్డు మీద నడుచుకుంటూ పాత ఇనుము కొనుగోలు చేసే షాపు వద్దకు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చినట్లుగా కనిపించింది. అర్ధరాత్రి రెండు గంటల తర్వాత కార్యాలయంలోకి వెళ్లి బీరువాను పగల కొట్టి స్టాంపులు, తోక బిళ్లలు తీసుకొని పరారయ్యారు. గతంలో జిల్లాలోని పలు సెంటర్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల దొంగతనాలు జరిగాయి. ఆ వ్యవహారంలో అనుభవం కలిగిన దొంగలే ఇక్కడ కూడా చోరీ చేసి ఉంటారా అని పోలీసులు ఆ దిశగా కూడా పరిశోధన చేస్తున్నారు. కార్యాలయంలోని సిబ్బందిని స్టేషన్కు పిలిచి సీసీ ఫుటేజ్‌ను చూపించి విచారిస్తున్నారు. చోరీ జరిగిన స్థలంలో గ్లౌజు వదిలి వేయడంతో దానిపై ఉన్న వేలిముద్రల ఆధారంగా కేసును చేధించడానికి పోలీసులు మరో కోణం నుంచి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిసింది. గన్నవరంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు అయిన తర్వాత స్టాంపుల చోరీ జరగడం ఇదే మొదటిసారి అని అధికారులు చెబుతున్నారు.

అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



ప్రజాశక్తి-విజయవాడ: బ్రిటీషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటీషు పాలనలో తెల్ల దొరలు గిరిజనుల శరీరకంగా మానసికంగా హింసిస్తూ వారి శ్రమను, అటవి సంపదను దోచుకుని అటవిక పరిపాలన సాగిస్తున్న నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు ప్రాణాలను సైత్యం పణంగా పెట్టి బ్రిటీషు అధికారులకు ఎదురునిలిచి పోరాడిన తీరును నేటి తరం స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. మన్యం ప్రజలలో చైతన్యం, తీసుకువచ్చి స్వేచ్ఛావాయువులు పీల్చుకునేలా బ్రిటీషు వారిపై ఆయన చేసిన పోరాటం, త్యాగం ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తి మార్గంలో పైనిస్తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మన్యం ప్రాంతంలోని గిరిజనుల బాధలను దగ్గరగా గమనించి, తెల్లదొరల దమన రాజకీయానికి వ్యతిరేకంగా గళమెత్తిన అల్లూరి సీతారామ రాజు ప్రజల్లో చైతన్యం నింపి, వారికి ధైర్యసాహసాలను కలిగించి పోరాట మార్గాలు నేర్పించారన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అన్నారు. ఇతను జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు అని తెలిపారు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొని వీర మరణం పొందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయిందని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్. శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ సిహెచ్ .దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారిణి డి.ఎంఎఫ్ విజయకుమారి, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్. వి. మోహన్‌రావు, డివిజనల్ పిఆర్‌వో కె. రవి కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు. విజయవాడ నగరపాలక సంస్థలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, నగర కమిషనర్ ధ్యానచంద్ర వేర్వేరుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నగర పోలీస్ కమీషనర్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కమిషనర్ ధ్యానచంద్ర పర్యటన



ప్రజాశక్తి-విజయవాడ: నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. కొత్త రాజరాజేశ్వరి పేట, డాబా కోట్ల సెంటర్, అజిత్ సింగ్ నగర్, అయోధ్య నగర్ ప్రాంతాలను శుక్రవారం కమిషనర్ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జే ఎన్ ఎన్ యు ఆర్ ఎమ్ ఇళ్లలో నివసించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, మురుగు నిరుపారుదలకు తగిన చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అన్నారు. కొత్త రాజరాజేశ్వరి పేట రైల్వే ట్రాక్ వద్ద ఉన్న నిర్మాణం దశలో ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రైవ్ ని పరిశీలించారు. డ్రైన్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె. అర్జున్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాస్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

జన పోరుబాట

మరో భారం మోపుతారన్నారు. అధిక కరెంటు వినియోగించే రాత్రి వేళల్లో అధిక రేట్లు నిర్ణయించే విధానాన్ని ప్రవేశపెడుతున్నారని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసే స్వదేశీ, విదేశీ బడా కంపెనీలకు విద్యుత్ యూనిట్‌కు రూ.2, 3 తగ్గించి రాయితీ ఇస్తున్నారని, సామాన్య ప్రజలకు, చిరు వ్యాపారులకు సర్దుబాటు ఛార్జీలు వేసి అదనపు భారం మోపుతున్నారని తెలిపారు. దీనికి తోడు స్మార్ట్ మీటర్లు బిగించిన చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారులకు అందరికీ తప్పుడు రీడింగ్‌లతో ఎక్కువ వినియోగం చూపించి పది రెట్ల వరకు బిల్లు పెంచేస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ చేపిస్తామని హామీ ఇచ్చిన విద్యుత్ శాఖ మంత్రి నోరు మెదపటం లేదన్నారు. నాడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపుఇచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ నేడు మౌనం వహిస్తున్నారని విమర్శించారు. అందుకే ప్రజలే ఉద్యమించాలని, విద్యుత్ భారాలను నిరసించాలని, వీధివీధినా, ఇంటింటా స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. తొలి అడుగు పేరుతో వచ్చే శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీయాలన్నారు. ప్రజల అనుమతి లేకుండా బెదిరించి, దొంగ చాటున స్మార్ట్ మీటర్లు బిగిస్తే వినియోగదారులే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పవర్ జోలికి వస్తే చంద్రబాబు పవర్ కోల్పోతారని గుర్తుంచుకోవాలని, ఇప్పటికైనా స్మార్ట్‌మీటర్లను రద్దు చేసి, విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, నాయకులు బి.రమణారావు, బోయి సత్యబాబు, పి.కృష్ణ, కె.దుర్గారావు, ఈవీ నారాయణ, క్రాంతి, సూరిబాబు, చిన్నారావు, శేఖర్, రమణ, సరోజ, ఆదిలక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనతో నవోదయం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల్లో అవగాహన కలిగించి రాష్ట్రంలో నాటుసారాను నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని ప్రారంభించిందని.. ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి సమిష్టి కృషితో నాటుసారా రహిత జిల్లా, రాష్ట్రం కోసం కృషి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. నవోదంయ 2.0 ద్వారా చేపడుతున్న జన జాగృతి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ నవోదయం సత్ఫలితాలు ఇచ్చిందని, ఇదే స్ఫూర్తితో నవోదయం 2.0ను ప్రారంభించడం జరిగిందని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా భాగస్వామ్యంతో కషిచేయాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలు కూడా క్రియాశీలంగా పనిచేస్తున్నాయని.. ఈ కమిటీల సహకారంతో విస్తత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు దిశగా నడిపించాలని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం, రెడ్డిగూడెం మండలాల పరిధిలోని 26 గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా వీటి ఆనవాళ్లు కనిపిస్తే 14405 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌వీ రామశివ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు ఆర్‌బీ పెద్దిరాజు, జె.రమేష్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీవీఎస్ఎన్ వర్మ, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎంజే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేయాలి



ఉయ్యూరు మండలంలో..

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని కొత్త మాజేరు లోని ఏపీ రాష్ట్ర గెడ్డంగుల సంస్థ హమాలి ముఠా వర్కర్స్ యూనియన్ కార్మికులు టెక్నికల్ అసిస్టెంట్ శిరీషకు సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా ఆధ్వర్యంలో సమ్మె నోటీసును శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా మహమ్మద్ కరీముల్లా మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు సూచించారు. ఈ కె పవన్ ,కోన వెంకటేశ్వరమ్మ, చాట్రగడ్డ నాగలక్ష్మి, బిర్ల చిన్నవెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పురిటిగడ్డ పిహెచ్ సి వైద్యులు విజయ్‌కు ఆశ వర్కర్లు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ కరీముల్లా, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రశాంతి, లలిత, సీతారావమ్మ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జులై 9న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులందరు పాల్గొనాలని సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం ఉయ్యూరు మండల సిఐటియు జనరల్ బాడీ సమావేశం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా సభ్యుడు బి రాజేష్ అంగన్వాడి, పెద్ద ముఠా,పారిశుధ్యకార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, మోటార్ మెకానిక్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా సిఐటి ఉపాధ్యక్షులు ఓ గంగాధర్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని బంగ్లా వద్ద సమ్మె జయప్రదం చేయాలని ప్రదర్శన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ హేమలత, వైస్ సంఘ నాయకులు శివనాగేంద్ర, మధ్యాహ్న భోజనం విజయలక్ష్మి, బిల్డింగ్ వర్కర్ యూనియన్ ఖాన్‌పెచాల పాల్గొన్నారు. **ప్రజాశక్తి - పామర్రు :** మండల పరిధిలోని కనుమూరు పిహెచ్ సి వైద్యులు డాక్టర్ రాజేష్ కు పామర్రు ఆశ వర్కర్లు శుక్రవారం వినతి పత్రం అందించారు. తమను పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కమ్యూనిటీ వర్కర్లను ఆశలుగా మార్చాలని ఒప్పంద జీవోలు విడుదల చేయాలని, నియామకాలను నేరుగా ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ నాయకురాలు సావిత్రి, కమల తదితరులు పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో...



పామర్రు మండలంలో...

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - పామర్రు : స్థానిక ఆర్‌అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన పి4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్షిప్) (దాతల సహకారంతో పేదలను ఆదుకునే పథకం) కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన తాతినేని విజయ్ కుమార్ మార్గదర్శిగా వచ్చి బంగారు కుటుంబాన్ని గుర్తించి వారికి 1లక్ష 20 వేల రూపాయల నగదును పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతుల మీదుగా అందించారు. ఈ పథకానికి చైర్మన్గా ఉన్న ఎమ్మెల్యే వర్ల మాట్లాడుతూ ఈ సంవత్సరం 2 వేల బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ప్రత్యేక అధికారి పి. శివప్రసాద్ యాదవ్, పామర్రు ఎంపీడీవో కే,జ్యోతి, మొవ్వ,పెదపారుపూడి, తోట్లవల్లూరు, పమిడిముక్కల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో కార్మికులకు భద్రత కరువు : సిఐటియు

ప్రజాశక్తి-గన్నవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల అసంఘటిత రంగంలోని కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని, రక్షణ లేకుండా పోతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల స్థాయి కార్మిక సంఘాల విస్తత సమావేశం జరిగింది. దీనికి సిఐటియు మండల అధ్యక్షులు బెజవాడ తాతబ్బాయి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల్ని ఆదుకోవటానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు గురించి పట్టించుకోవటంలేదని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు వై.నరసిం హారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో అంగన్వాడీలకు ముఠావర్కర్లకు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. అనంతరం కన్వీనింగ్ కమిటీ కార్యదర్శిగా తాతబ్బాయిను ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు సమ్మక్క, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళ్లం వెంకటేశ్వరరావు

అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- ఉంగుటూరు : అసైన్మెంట్ భూముల సమస్యలను జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని ఎలుకపాడు పరిసర ప్రాంతాల్లో బుడమేరు విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతుల వివరాల పరిశీలనకు వచ్చిన ఆర్డీవో సుబ్రహ్మణ్యంను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి వి లక్ష్మణ స్వామి, మండల పార్టీ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావులు ఎలుకపాడు ఎస్సైన్మెంట్ భూమి బాధితులతో కలిసి ఆన్లైన్ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అసైన్మెంట్ భూ బాధితులకు ఆన్లైన్ చేయటంలో జాప్యం జరిగిందని, వాటిని జిల్లా కలెక్టర్ వారి దష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి విమలా కుమారి, రెవెన్యూ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు చదువుతోపాటు ఆటలలోనూ ప్రావీణ్యం సాధించాలని పమిడిముక్కల ఎంఈఓ పద్మరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు ప్రాథమిక పాఠశాలలో మాజీ సర్పంచ్ తిరుమల శెట్టి బోసుబాబు అందించిన నోట్‌పుస్తకాలను, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మధ్యాహ్నం భోజనం, ఉచిత పుస్తకాలు పంపిణీ, డ్రస్సులు, తల్లికి వందనంలాంటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, వేల్పూరు వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఉపాధ్యాయులు నాని, బాబు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పోలీస్ శాఖలోని వివిధ విభాగాల సిబ్బంది సమస్యల పరిష్కరించి వారి సంక్షేమానికి ఎల్లపుడు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు.ఆర్మడ్ రిజర్వ్, స్పెషల్ పార్టీ మరియు హెూంగార్డ్స్ సిబ్బందికి జిల్లా ఎస్పీ శుక్రవారం దర్బార్ పెరేడ్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో జీవించా లంటే పోలీస్ శాఖ పాత్ర విశిష్టమైనదన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించా లన్నారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కేసరపల్లి-1లో శుక్రవారం వైద్యాధికారిణి టి.సజన ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సజన మాట్లాడుతూ ఈ వ్యాధి తల్లిదండ్రుల నుండి వారసత్వ అనువంశికంగా సంక్రమిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి సంక్రమించిన వారికి రక్తహీనత, నేత్రాలు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులు, అతిగా అలసట రావడం ఈ వ్యాధి లక్షణాలని ఆమె వెల్లడించారు. ఈ వ్యాధిని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షల ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చని తెలిపారు. సి.హెచ్.ఓ కుమారి, ఎం ఎల్ హెచ్ పి కె.తేజస్విని, హెచ్ వి రాజ్యం, ఎం పి హెచ్ ఎ ఎం. డి.సీతారామయ్య, పాల్గొన్నారు.

సిఐ చిట్టిబాబుకు ప్రశంసలు



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌లో 2020 సంవత్సరంలో ఎస్‌ఐగా పని చేసినప్పుడు నమోదు చేసిన కేసుకు ఐదు సంవత్సరాల తర్వాత 2025లో పూర్తి దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేటట్లు చేసిన సిఐ వై.చిట్టిబాబును జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ ప్రశంసించారు. అవనిగడ్డ గ్రామస్తుడైన రాజనాల సుధీర్ 2020 సంవత్సరం ఫిబ్రవరి 28న న అవనిగడ్డ- విజయవాడ కరకట్ట సర్వీస్ బస్సులో కండక్టర్‌గా విధులలో వుండగా శ్రీకాకుళం వద్ద జటావత్ ప్రదీప్ అనే వ్యక్తి ఎక్కి టికెట్ తీసుకొని చిల్లర విషయంలో గొడవపడ్డాడు. ఇదే విషయాన్ని ప్రదీప్ తన తండ్రికి చెప్పగా అతను కూడా బస్సును వెంబడించి కండక్టర్‌పై దాడి చేశారు. దీనిపై కండక్టర్ అప్పటి తోట్లవల్లూరు ఎస్సై వై. చిట్టి బాబుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఐదు సంవత్సరాల తర్వాత నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక సంవత్సర కాలం పాటు సాధారణ జైలు శిక్ష, రూ. 10వేలు జరిమానా విధించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన సిఐ వై. చిట్టి బాబును ఎస్పీ ప్రశంసించారు.

నకిలీ మద్యం విక్రయిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల వద్ద నుండి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైస్ సీఐ సిహెచ్. అరుణమ్మ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల వద్ద కన్నా తక్కువ ధరకు మద్యం విక్రయిస్తానంటే, అట్టి వారి మాటలు నమ్మి నకిలీ మద్యాన్ని కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. మండలంలో ఎవరైనా నకిలీ మద్యం విక్రయిస్తున్న సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405 కు తెలియజేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రాజాకు మాతృవియోగం



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర సిష్టకరణాల సాధికార సమితి కన్వీనర్, పెనమలూరు నియోజ వర్గ పరిశీలకులు రాజా మాతృమూర్తి లక్ష్మీ గురువారం రాత్రి అస్వస్థతతో మృతిచెందారు. ఆమె హౌసింగ్ బోర్డ్ కాలనీ స్వగృహంలో భర్త , కుమారుడు ,కోడలు, దగ్గర ఉంటున్నారు. పలువురు లక్ష్మీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇంటి నుంచి గెంటేశారు

- కలెక్టర్‌కు వృద్ధుడి మొర

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : నందివాడ మండలం పుట్టగుంట గ్రామానికి చెందిన వద్ధులు గొన్నూరు సత్యనారాయణ రెడ్డి తన దివ్యాంగురాలైన కుమార్తె ఝాన్సీ లక్ష్మి సహాయంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మీకోసం సమావేశ మందిరం వద్ద కలుసుకొని సమస్య వివరించారు. తనపై తన కుమారుడు కాశి విశ్వనాథ వరప్రసాద్ రెడ్డి దాడి చేశారని, తనను ఇంటి నుంచి గెంటేశాడని తనకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నందివాడ మండల తహసిల్దార్ గురుమూర్తిని, బాధిత సత్యనారాయణ రెడ్డి కుమారుడు విశ్వనాథ వరప్రసాద్ రెడ్డిని కూడా మచిలీపట్నం కలెక్టరేట్ కు పిలిపించారు. భవిష్యత్తులో తండ్రి పై దాడి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా అతని తండ్రి సంరక్షణ బాధ్యత అతనిదేనని, ఆయన బాగోగులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. బాధిత వద్ధునిపై ప్రత్యేక దష్టి సారించి మరలా అలాంటివి జరగకుండా చూడాలని సంబంధిత తహసిల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.



వృద్ధుడి సమస్య వింటున్న కలెక్టర్



దిగువ పొలాలకు నీరు విడుదల

ప్రజాశక్తి - వత్సవాయి : రైతు సంక్షేమ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. మండలంలోని పోలంపల్లి మున్నేరు ఆనకట్టనుండి మునేరు కాల్వకు నీటిని విడుదల చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనీటి ద్వారా మూడు మండలాలు వత్సవాయి పెనుగంచిప్రోలు నందిగామ పరిధిలోనీ 25 గ్రామాల్లో సుమారు 25.000 ఎకరాల ఆయకట్టకు నీరు చేరుతుందన్నారు. అనకట్ట దగ్గర రైతులతో జరిగిన చర్చలో మున్నేరు పాత ఆనకట్టను పూర్తిస్థాయిలో మరమత్తులు చేయుటకు సుమారు 19.09 కోట్ల నిధులు మంజూరుకు తీవ్రంగా ప్రయత్నించున్నట్లు ఈ మరమ్మతులను వచ్చే వేసవిలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, రైతులు, అధికారులు డిఇ.ఇ.రఘు, ఎఇఇ వత్సవాయి మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి- నందిగామ : ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజు కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడారు. కనీస వేతనం 26వేలు ఇవ్వని పక్షంలో జులై నాలుగు తర్వాత రాష్ట్రంలో ఇతర మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరూ కూడా సమ్మెలో ఉంటారని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో మెయిన్ వాటర్ ట్యాంకిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ నాయకులు అధ్యక్షులు పరిమిరవి, కార్యదర్శి శ్రావణ్ కుమార్, కోశాధికారి కండెల శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం శుక్రవారం పార్టీ మండల కార్యాలయంలో విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి వి. ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో పి.వి. ఆంజనేయులు మాట్లాడుతూ రెడ్డిగూడెం మండల కేంద్రంలో ఎస్సీ ఏరియాలో దశాబ్దంన్నర కాలంగా సామాజిక భవన నిర్మాణం కలగానే మిగిలి పోతుందన్నారు. రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలని, పాఠశాల స్థలం దురాక్రమణకు అడ్డుకట్ట వేయాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనీ, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పక్కా గృహాలు నిర్మించుకునే వారికి ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సి పి యం పార్టీ మండల కార్యదర్శి తుమ్మల వీరాస్వామి, సీనియర్ నాయకులు కామ్రేడ్ మద్దిరెడ్డి మాధవరెడ్డి, ఉయ్యూరు కష్ణారెడ్డి, అప్పిరెడ్డి, విజయ్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

200 టన్నుల కందుల కొనుగోలుకు మోక్షం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలోని వీరులపాడు మండలం చౌటపల్లి, చట్టన్నవరం గ్రామాల కంది రైతులు ఎదుర్కొన్న కందుల కొనుగోలు సమస్యకు మాజీ ఇరిగేషన్ మంత్రి, టిడిసి నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు సత్వర చర్యలతో పరిష్కారం లభించింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,500 క్వింటాల్‌కు లభించాల్సిన కందులను, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఆగిపోవడంతో రైతులు దళారులకు రూ.6,000లకె అమ్మవలసి వచ్చింది, దీని వల్ల బస్తాకు రూ.1,500/- నష్టం చవిచూసే దుస్థితి నెలకొంది. దీంతో రైతులు కందుల బస్తాలతో దేవినేని ఉమా కార్యాలయానికి చేరుకొని, తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కందులు అమ్మకపోతే తదుపరి పంట సాగు అసాధ్యమని వాపోయారు. దేవినేని ఉమా 200 టన్నుల కందులను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అధికారులు, మిల్లర్లు, కంది వ్యాపారులతో చర్చించి కొనుగోళ్లకు మార్గం తెరవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కందులు పరిశీలిస్తున్న దేవినేని ఉమామహేశ్వరరావు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



ఉపాధి పనుల వివరాలు హాజరు పట్టీ పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరువూరు : 2024- 25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి పనులపై తిరువూరు మండల పరిషత్ కార్యాల యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు శుక్రవారం డ్వామా పిడి రాము ఆధ్వర్యంలో జరిగింది. సామాజిక తనిఖీ బందం మండలంలోని అన్ని పంచాయతీలలో చేపట్టిన ఉపాధి పనుల్లో జరిగిన లోపాలను, అక్రమాలను ఎత్తి చూపారు. కొన్ని పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఎ) కొంతమంది కూలీలు పనికి రాకపోయినా వచ్చినట్లు హాజరేసి వేతనం ఇప్పించిన ట్లు చెప్పారు. మరి కొంతమంది ఎఫ్ఎలు మస్టర్ పుస్తకాలలో హాజరు దిద్దారని, తక్కువ పని చేయించి ఎక్కువ పని చేయించినట్లు క్షేత్రస్థాయి సర్వేలు తేలినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. పనిచేసిన ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళ్లేందుకు దారి సౌకర్యం లేదని కొంతమంది ఎఫ్ఎలు వెళ్లనీయకుండా చేశారని, అక్కడ పని జరిగిందో లేదో తెలియదని, బిల్లు మాత్రం చేశారని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన ఎఫ్ఎల నుండి రికవరీ చేస్తామని పీడీ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ గద్దల భారతి, ఎంపీడీవో రవి కుమార్, ఉపాధి పథకం జిల్లా అధికారులు, ఏపీవోలు ముని, మాధవరెడ్డి, సిసిలు తదిత రులు పాల్గొన్నారు.

15న హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - నందిగామ : జూలై 15న తిరువూరులో జిల్లా హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా 4వ మహాసభలో హమాలీ/ముఠా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పిలుపునిచ్చారు. నందిగామ రైతు బజారు ముఠా వర్కర్స్ యూనియన్ రైతు బజార్ దగ్గర శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కె.గోపాల్ మాట్లాడుతూ ముఠా కార్మికుల హక్కులు, సంక్షేమం, సంక్షేమ నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. ఎగుమతులు, దిగుమతుల్లో ముఠా కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామీణ కాటా, షాపులు, రైతు బజార్లు, ఆల్మాల్స్, పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లై), సెంట్రల్ వేర్ హౌస్ (సిడబ్ల్యుసి), స్టేట్ వేర్ హౌస్ (ఎస్డబ్ల్యుసి), వ్యవసాయ మార్కెట్ యార్డు (ఎఎంసి) తదితర గోడౌన్లలో వివిధ రకాల ముఠా కార్మికులు జిల్లాలో వేలాది మంది పనిచేస్తున్నారని తెలిపారు. అపరిమితమైన పనిగంటలు, అధిక బరువులు మోయడంతో కీళ్ళ కండరాల జబ్బులతో అనారోగ్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో 15న జరగనున్న మహాసభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ రఫీ, ంరియన్న, దేవరాజు, శివకృష్ణ, ముక్కంటి, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.



నందిగామ రైతుబజారు లో నిరసన తెలుపుతున్న కార్మికులు

6న మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 13న జరగబోయే జూనియర్ సివిల్ జడ్జ్ పరీక్షకు సన్నాహకంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఈ నెల 6న స్థానిక మొగల్రాజపురం జమ్మి చెట్టు సెంటర్ వద్ద ఉన్న మోడరన్ అకాడమీలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఐలు ప్రధాన కార్యదర్శి సంపర దుర్గా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ నెల 13న జరిగే పరీక్షను రాయడానికి, వారి నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ మోడల్ ఎగ్జామ్ దోహదపడుతుందన్నారు. ఈ మోడల్ పరీక్షను ఉపయోగించుకుని 13న జరగనున్న పరీక్షలు విజయం సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.



స్మార్ట్ మీటర్లు వద్దంటూ నినాదాలు చేస్తున్న ప్రజలు, నాయకులు

స్మార్ట్ మీటరన్లు వ్యతిరేకిస్తూ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సిపిఎం కొండపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురించిన స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో కొండపల్లి బ్యాంక్ సెంటర్ వద్ద స్మార్ట్ మీటర్లు ఉప సంహరించు కోవాలని, ట్రూ అప్ యూజర్ ఛార్జీలు రద్దు చేయాలని సెకీ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టైమ్ ఆఫ్ డే విధానం రద్దు కోరుతూ ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లు మా ఇంటికి బిగించొద్దంటూ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, టౌన్ కమిటీ సభ్యులు ఎ.విఠల్‌రావు, ఈ కొండలరావు, ఎస్‌కె బాషా, బి.వెంకటేశ్వరరావు, ఎల్.పార్వతి, బేబీ, పిఎన్ఎం కవి, ఎన్ బాబ్జి, కె.కోటేశ్వరరావు, పాపయ్య పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : శుక్రవారం ముఠా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గొల్లపూడిలోని కమర్షియల్ కాంప్లెక్స్‌లో ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈనెల 9న దేశవ్యాప్తంగా లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఉద్యోగ కార్మిక చేస్తున్న సమ్మెను ముఠా కార్మికులు పని బంద్ చేసి సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రథం సెంటర్ నుండి ప్రదర్శన, లెనిన్ సెంటర్లో సభలను జయప్రదం చేయాలని కోరారు. **విజయవాడ :** లేబర్ కోడ్‌ల రద్దు, ఇతర సమస్యల పరిష్కారానికై ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. సింగ్ నగర్ కృష్ణ హోటల్ సెంటర్లో ఉన్న మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో సెంట్రల్ సిటీ ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభ దుర్గా లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కమల, సిఐటియు జిల్లా నాయకులు కె.దుర్గారావు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ ఏర్పడింది. గౌరవ అధ్యక్షులుగా కె.దుర్గారావు, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష , కార్యదర్శులుగా ఈ. దుర్గా లక్ష్మి, ఎస్కే. షాహినాబేగం, ఉపాధ్యక్షులు, కె.రుక్మిణి సహాయ కార్యదర్శి, వి.కళ్యాణి కోశాధికారిగా ఎన్.సరిత, మరో 22 మందితో నూతన కమిటీని ఏర్పడింది. ఈ కార్యక్రమాల్లో మాధవి, టీ. రాధా, అరుణ, విజయలక్ష్మి, నాగమణి, సుజాత, సంధ్యా ,సారిక, ఝాన్సీ, వెంకటరమణ పాల్గొన్నారు. **వత్సవాయి :** సమ్మెను జయప్రదం చేయాలని వత్సవాయి మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో సిఐటియు విస్తృత సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏ.కమల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.రాము అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు టి.మదుకుమారి, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జి.నాగేశ్వరీ, మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **తిరువూరు :** సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి వెంకటేశ్వరావు కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మెపై వేసిన ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను, సమ్మె పోస్టర్లను శుక్రవారం తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. **నందిగామ :** నందిగామ తహశీల్దారు సురేష్‌కు విఆర్ఎ సంఘ నాయకులు శు క్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్, వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు కుక్కల శీను, ఫాతిమా, వీఆర్ఏలు పాల్గొన్నారు.



వత్సవాయిలో మాట్లాడుతున్న కమల



నూతనంగా ఎన్నుకున్న కమిటీతో కమల, దుర్గారావు (విజయవాడ, కృష్ణా హోటల్)

మానికొండ సూర్యావతికి నివాళి



గన్నవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : మహిళల అభ్యున్నతికి పాటుపడిన అమరజీవి మానికొండ సూర్యవతి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. శుక్రవారం గన్నవరం సిపిఎం కార్యాలయంలో మానికొండ సూర్యవతి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆమె చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. నరసింహారావు మాట్లాడుతూ సూర్యావతి సర్పంచిగాను, ఉంగుటూరు ఎంపీపీ గాను, ఎమ్మెల్సీ గాను పనిచేశారని, ప్రజా సేవ చేయడం ద్వారా జనాల్లో గుర్తింపు పొందారని చెప్పారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి మరుగుదొడ్లు కట్టించడం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసారన్నారు. అటువంటి గొప్ప నేత చూపిన ఆశయాల బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో కే. వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, తాతబ్బాయి, ఉదయ భాస్కర్ రావు , ఎస్. సాంబశివరావు, బ్రహ్మాచారి, దాదా, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉంగుటూరు : మహిళల అభ్యున్నతి కోసం ఉద్భవించిన నేత మానికొండ సూర్యావతి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి లక్ష్మణస్వామి అన్నారు. మానికొండ సూర్యవతి వర్ధంతిని ఉంగుటూరులోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, వెన్నూతల గ్రామ సర్పంచ్ టి వి రామ్మోహన్ రావు, పార్టీ నాయకులు సాంబశివరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో...

ప్రజాశక్తి-ఉయ్యూరు మహిళలకు సమాన హక్కులు కల్పించాలి మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని తొలితరం మహిళ ఉద్యమ నేత మానికొండ సూర్యవతిని ఆదర్శంగా తీసుకోవాలని మహిళా సంఘం ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు నిమ్మది నాగమణి అన్నారు. శుక్రవారంఉయ్యూరు పట్టణంలోని ఐదో వార్డులో సూర్యవతి చిత్రపటానికి మహిళా సంఘం నాయకురాలు మామిడి ఎల్లమ్మ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. జిడి కృష్ణవేణి మల్లేశ్వరి పాప రమణమ్మ సుజాత పెద్ద వెంకటేశ్వర్లు శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ప్రజాసంక్షేమమే ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి- తోట్లవల్లూరు : మండల పరిధిలోని దేవరపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో ఆ సమస్య పరిష్కారానికి మార్గదర్శకాలు జారీ చేశారు. గ్రామంలో గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి సంబంధించిన అధికారులతో చర్చించి నెల రోజుల్లో ఆ సమస్యలు పరిష్కారం కావాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, గ్రామ సర్పంచ్ మరిది వెంకటేశ్వరరావు, వీరంకి పరుశురాం, మూడే శివశంకర్, ఎంపీడీవో రవికాంత్, తాసిల్దారు కుసుమకుమారి పాల్గొన్నారు.

నిధులున్నా పనులెందుకు పూర్తి చేయడం లేదు

- ఆర్డబ్ల్యూఎస్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో సిఎస్ఆర్ నిధులు ఉన్నప్పటికీ సూక్ష్మనీటి ఫిల్టర్ల నిర్మాణ పనులు ఎందుకు పూర్తి చేయలేక పోతున్నారని, విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యం పనికిరాదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం హాలులో గ్రామీణ నీటి సరఫరా ఫిల్టర్లు, అంగన్వాడి కేంద్రాల్లో వర్షపు నీటి నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం కలక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటిని శుద్ధి చేసే సూక్ష్మ నీటి ఫిల్టర్ (మైక్రో వాటర్ ఫిల్టర్)లను నిర్మించడంలో ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు సరైన శ్రద్ధ చూపకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పలు కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సిఎస్ఆర్)నిధులు సమకూర్చినప్పటికీ గత 4 నెలలుగా ఏమాత్రం పనిచేయక పురోగతి సాధించక పోవడం సరైన పద్ధతి కాదన్నారు .జిల్లాలో మొత్తం 53 సూక్ష్మ నీటి ఫిల్టర్ల నిర్మాణ పనులు 8.59 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరు కాగా ఇప్పటివరకు కేవలం 25 పనులను పూర్తి చేసి 4.33 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ఇంకా 23 పనులు పురోగతిలో ఉండగా మరో 5 పనులు ఇంకా ప్రారంభించక పోవడం పై తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రత్యేక శ్రద్ధ వహించి పనులు పూర్తి చేయాలన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని బిరుదుగడ్డ నుంచి దాలిపర్రు వరకు ఉన్న గుండేరు కరకట్టల అభివృద్ధి పనులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. రూ.48 లక్షలతో 3.2 కిలోమీటర్లు కరకట్టలను అభివద్ధి పర్చనున్నారు. చిల్లలవాగు కుడి కట్ట బలహీనంగా ఉండటం వల్ల డ్రైన్లోని నీరు పొంగి పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని కట్టను బలపర్చాలని ఆయకట్టు రైతులు గతంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దష్టికి తీసుకెళ్లారు. మంగళి' కోడు నుంచి కట్ట ఐదు చోట్ల గత సంవత్సరం కోతకు గురికాగా, రైతులే స్వచ్ఛందంగా పూడ్చుకున్నామని, కట్టను బలోపేతం చేయాలని వారు ఎమ్మెల్యేకు వివరించగా, అభివద్ధి పరుస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భానుప్రకాష్, నీటి సంఘం అధ్యక్షులు దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా చలసాని పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చలసాని ఆంజనేయులు

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్, అప్పనవీడు ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ అనాథ పిల్లల సమక్షంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి 4 స్ఫూర్తిగా ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ, అప్పనవీడు, హనుమాన్ జంక్షన్ లోని ఇద్దరు అనాథ బాలికలను దత్తత తీసుకుని వారి బాధ్యత లను స్వీకరించానన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి వెళ్లిన సమాజ శ్రేయస్సుకు పాటుపడటం ద్వారానే జీవితానికి సార్ధకత చేకూరుతుందన్నారు. పాడి రైతుల అభ్యున్నతికి కషి చేస్తున్నామన్నారు. తదనంతరం కృష్ణా, గోదావరి జిల్లాల పాల సంఘ అధ్యక్షులు, పాడి రైతులు సుమారు 300 మంది సమక్షంలో హనుమాన్ జంక్షన్ కాకాని కళ్యాణ మండపంలో చలసాని ఆంజనేయులు జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రముఖులు పాల్గొన్నారు.



ఆధార్ నెంబర్‌కు ఎన్‌పిసిఐకు లింక్ చేసుకోవాలి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్‌సి విద్యార్థిని /విద్యార్థులకు తల్లికి వందనం పథకంనకు సంబంధించి ఈ నెల 10వ తేదీన అమౌంట్ విద్యార్థుల బ్యాంకు అకౌంట్ కు జమచేయనున్నారని జిల్లా ఎస్‌సి సంక్షేమ, సాధికారిత అధికారి షాహీద్ బాబు షేక్ తెలిపారు. 2025-26 ఇంటర్ మొదటి సంవత్సరము చదువుచున్న విద్యార్థులు పేరున ఉన్న బ్యాంకు అకౌంట్ కు ఆధార్ నెంబర్ కు (ఎన్ పి సి ఐ) లింక్ కానివారు అందరూ బ్యాంకు కు వెళ్లి ఆధార్ నెంబర్ కు లింక్ చేయంచుకోవాలన్నారు. అకౌంట్ లేని విద్యార్థులకు అమౌంట్ జమకాదన్నారు.

తడి,పొడి చెత్త విడివిడిగా సేకరించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని డిఎల్‌పిఓ జి. సంపత్ కుమారి అన్నారు. మండలంలోని డోకిపర్రు గ్రామపంచాయతీలో జరుగుతున్న డోర్ టు డోర్ చెత్త సేకరణ, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గృహిణి ఇంటిలోనే తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా రెండు డస్ట్ పిన్ లో నిల్వ ఉంచి మరుసటి రోజు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందచేయాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అంటువ్యాధులు రాకొండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ గోసాల జ్యోతి, ఇంచార్జ్ ఇఓపిఆర్డి ఏజెయల్ నరసింహారావు, కుసుమ కుమార్, లవ కుమార్ పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ జరగనున్న శాకాంబరి అలంకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. శాకాంబరి అలంకరణకు అవసరమగు కూరగా యలు, పండ్లు, ఆకుకూరలు దేవస్థానం దాతలు సంయుక్తముగా ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా కొండలమ్మ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా పద్మాలపాలెం గ్రామస్థులు అమ్మవార్లకు సారె, పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : సమాజంలో బలహీనులకు అండగా నిలవటమే రంగాకు అర్పించే నిజమైన నివాళి అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు శుక్రవారం రాధా రంగా మిత్రమండలి నాయకులు యా సం చిట్టిబాబు ఆధ్వర్యంలో రంగా 78వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రక్షణగా నిలిచిన నాయకుడు మోహన్ రంగా అని కొనియాడారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయగా మచిలీపట్నం డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ హనుమంతరావు సిబ్బంది పాల్గొని రక్తం స్వీకరించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భావిరి శంకరానంద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వంగర శేషగిరిరావు పాల్గొనగా తొలుత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య స్వామి వివేకానంద వర్ధంతి అల్లూరి సీతారామరాజు రంగా చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు చిట్టిబాబు అందజేసిన దుస్తులను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అగ్నికుల క్షత్రియ అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు కొడాలి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, టిడిపి జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరం ఆదినారాయణ, జనసేన ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నరేష్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి-కంకిపాడు : జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ విభాగంలో కంకి పాడుకు చెందిన విద్యార్థి బాకీ నరేష్‌కి పీహెచ్‌డి ప్రదానం చేస్తూ యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆప్టిమైజేషన్ ఆఫ్ వైర్ ఎలక్ట్రిక్ డిస్చార్జ్ టర్నింగ్ ఆఫ్ ఏరోస్పేస్ ఎలైస్ .అంశంపై నరేష్ డాక్టరేట్ పొందారు. మెకానికల్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ చెన్నకేశవరెడ్డి గైడ్గా వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ఏరోస్పేస్ విభాగంలో ఇంజిన్ భాగాలను సులభంగా, సమర్ధవంతంగా యంత్ర తయారీకి కొత్త పద్ధతిని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్‌కు పలువురు ఆచార్యులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



అంతరిక్ష పరిశోధక విద్యార్థిగా ఎంపికైన జాహ్నవికి అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన జాహ్నవి అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మిషన్‌లో పరిశోధక విద్యార్థిగా ఎంపికయ్యారు. శుక్రవారం పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని ఈ సందర్భంగా జాహ్నవిని ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ జాహ్నవి సాధన పాలకొల్లు మాత్రమే కాకుండా మొత్తం రాష్ట్రానికి గర్వకారణమని అభిప్రాయపడ్డారు. అంతరిక్ష పరిశోధన రంగంలో జాహ్నవి చేసిన కృషి యువతకు స్ఫూర్తిదాయకం. ఇలాంటి ప్రతిభావంత విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్ని విధాల సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యువతకు సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లో ఆసక్తి పెంచేలా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా జాహ్నవి ఆ స్థాయికి రావటానికి కష్టపడిన విధానాన్ని విద్యార్థినిలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, సిమ్మసర్తి వెంకటేశ్వరరావు, గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మి సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

కళాకారుల బకాయి సొమ్ము ఇప్పించాలి

ప్రజాశక్తి - తిరువూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను బుర్రకథ కళారూపాల ద్వారా ప్రజల్లో తీసుకెళ్లిన మాకు రావలసిన బిల్లును ఇప్పించాలని ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా బుర్రకథ కళాకారుల సంక్షేమ సమాఖ్య సభ్యులు కలెక్టర్ లక్ష్మీశకు విజయవాడలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 2018- 2019 సంవత్సరంలో గ్రామదర్శిని జన్మభూమి కార్యక్రమంలో చేసిన కళా ప్రదర్శనలకు సంబంధించిన వేతనాన్ని కళాకారులకు నేటి వరకు ఇవ్వలేదని, అనేక సార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని సమైక్య సభ్యులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈకార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షులు, రంగారెడ్డి, సమాఖ్య అధ్యక్షులు దార్ల యేసుపాదం, కార్యదర్శి కొప్పుల వసంతరావు, కోశాధికారి బొద్దుకోళ్ళ ఏసుదాస్, సభ్యులు వరికూటి రవికుమార్, సుజాత సీతారత్నం కుమారి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకొని పట్టణంలో 22వ వార్డు మిట్టగూడెంలో శుక్రవారం కెడిసిసి బ్యాంకు చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురామ్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) 'సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులోని ప్రజలు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య దష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ వారికి హామీ ఇచ్చారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం 29వ డివిజన్ పుట్లమ్మ గట్టులో కొండపల్లి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు, 29వ డివిజన్ కౌన్సిలర్, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం 29 డివిజన్‌లో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముద్దంగుల సాంబమూర్తి, కోనేరు ఏడుకొండలు, కొరటా శ్రీనివాస్ రాజు కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు.

ఆర్‌టిసి డిపో ఎదుట ఉద్యోగుల ధర్నా



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, సిసి ఎస్‌డి డెలిగేట్ చిలకా నాగేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నంబూరి చలపతిరావు, డిపో కార్యదర్శి ఎ.ఆనంద్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.సాంబశివరావు, షేక్ జిలానీ, గ్యారేజీ కార్యదర్శి వి.శివగోపీ, సభ్యులు పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీలోని ఖాళీలకు సరిపడా సిబ్బంది నియామకాలు చేపట్టాలని, తగ్గించిన షెడ్యూల్స్‌ను పెంచి సరిపడా కొత్త బస్సులను కొనుగోలుచేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కొరకు డిపోలను ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్నివిరమించుకోవాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బంది (డ్రైవర్) తోనే నడపాలన్నారు. పెండింగ్ డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలి, 11వ పి.ఆర్.సి అరియర్స్ (24 నెలల బకాయిలను) ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి అనే తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - గంపలగూడెం : దీర్ఘకాలికంగా గంపలగూడెం ప్రధాన రహదారి కిరువైపులా వాహనాలను నిలుపుదల చేసి ప్రజా ప్రయోజనాలకు వాహనదారులు ఆటంకం కలిగిస్తున్నారు. ప్రధానంగా గాంధీ సెంటర్లో ఈ ట్రాఫిక్ సమస్య రోజురోజుకి తీవ్రతరమైంది. ఎక్కడపడితే అక్కడ ప్రయాణికుడు ప్రయాణించేందుకు కూడా అసౌకర్యంగా తోపుడు బండ్లు, కార్లు, ఆటోలు, టూవీలర్లతో పాటు ఇతర వాహనాలు రహదారిని బ్లాక్ చేసి గంటల తరబడి పనులు చూసుకునేందుకు పోతున్నారు. ఈ పరిస్థితుల్లో వచ్చి, పోవు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గాంధీ సెంటర్ నుండి పార్థసారథి హోటల్ వరకు ఇరువైపులా నూతనంగా ఏర్పాటైన దుకాణాల ముందు వాహనాలు నిలుపుకునేందుకు ఏ కాస్త వెసులుబాటు కూడా లేకుండా చేయడంతో మరింత సమస్య ఏర్పడింది. అయినప్పటికీ ఈ తీవ్రమైన సమస్యలను ఎవరు పట్టించుకునే పరిస్థితులు లేవు. ఒక్కోసారి కార్లు సైతం బ్లాక్ చేసి, వారి వారి పనుల్లో గంటలపాటు నిమగ్నం అవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో పట్టించుకునే వారు లేక ప్రయాణికులు విసుకు చెందుతున్నారు. ఈ విషయమై గంపలగూడెం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం ప్రధాన రహదారిపై ట్రాఫిక్కు నియంత్రణ చర్యలకు సిద్ధమయ్యారు.



ట్రాఫిక్ నియంత్రణకు పరిశీలన చేస్తున్న సిబ్బంది

అల్లూరి సీతారామరాజు జయంతి

ప్రజాశక్తి - జి.కొండూరు : అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగినేని పాలెం నందు ఘనంగా నిర్వహించారు ముందుగా సీతారామరాజు చిత్రపటానికి పూలమాలను అలంకరించి ప్రధానోపాధ్యాయుడు వి నారాయణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ కార్యదర్శి డాక్టర్ పి.నాగరాజు ఉపాధ్యాయులు కమలకుమారి అమీర్ భాషా జాన్ బాషా సునీత మాధవరావు రమ తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ :** అల్లూరి సీతారామరాజు 128వ జయంతి కార్యక్రమం రామకృష్ణాపురం బుడమేరు వంతెన వద్ద శుక్రవారం నిర్వహించారు. విజయవాడ క్షత్రియ యువజన సంఘం, సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమా మహేశ్వరరావు, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వి.సూర్యనారాయ రాజు పాల్గొన్నారు. **మైలవరం :** అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన్రంగా జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **ఇబ్రహీంపట్నం :** డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రంలో అల్లూరి సీతారామ రాజు 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి చీఫ్ ఇంజనీర్ ఓ అండ్ యమ్ పి.శివ రామాంజనేయులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ మాట్లాడారు. **విస్సన్నపేట :** శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు శుక్రవారం రెవిన్యూ కార్యాలయంలో తహశీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. **తిరువూరు :** అల్లూరి సీతారామ రాజు జయంతి, జాతీయ జెండా రూప శిల్పి పింగళి వెంకయ్య వర్ధంతిని ఎ.కొండూరు మండలం, కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. **జగ్గయ్యపేట :** అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కొణిజేటి రోశయ్య జయంతి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోగల త్రిమూర్తి చౌక్‌లో కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శుక్రవారం నాడు విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య 92వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, బాపతి కోటిరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా గల కొణిజేటి రోశయ్య విగ్రహానికి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), శ్రీరాం చిన్నబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను వేరువేరుగా పాల్గొని రోశయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

వంగవీటి రాధా జయంతి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ తూర్పు నియోజకవర్గం 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్ లో స్క్రూ బ్రిడ్జి రంగా పార్కులో వంగవీటి మోహన రంగా 78 జయంతి సందర్భంగా పెద్దలు మాజీ డిప్యూటీ మేయర్ శ్రీ ఆళ్ల చెల్లారావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచి చీరలు పంపిణీ చేశారు. **విజయవాడ సిటీ :** విద్యాధరపురంలోని వివిం రంగా జంక్షన్ వద్ద ఉన్న స్వర్గీయ వంగవీటి రంగా విగ్రహం వద్ద విగ్రహ కమిటీ నాయకులు మైలవరపు దుర్గారావు, మైలవరపు కష్ణ, లింగం శివప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన స్వర్గీయ వంగవీటి రంగా 78వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ గాంధీ బొమ్మ వద్ద రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 78 వ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

నట్టల నివారణకు మందు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం కోకిలంపాడులో పశుసం వర్ధక శాఖ వైద్యులు 950 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు శుక్రవారం వేశారు. వర్షాకాలంలో జీవాలకు రోగాలు రాకుండా ముందస్తు చర్యలో భాగంగా ప్రభుత్వం నట్టల నివారణ మందును వేస్తున్నట్లు డాక్టర్ డి.అభిలాష్ తెలిపారు. ఈ కా ర్యక్రమంలో పశుసంవర్ధక ఆసుపత్రి వైద్య సిబ్బం ది ఎం.గోపాలకష్ణ, సి.హెచ్.నాగేంద్ర బాబు, రామారావు, గోపాలమిత్ర, రైతులు పాల్గొన్నారు. చిక్కుళ్లగూడెంలో డాక్టర్ శ్వేత జీవాలకు నట్టల మందు తాగించారు.

విద్యాసామాగ్రి అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జగ్గయ్యపేట జీవిత బీమా సంస్థ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లచ్చు నాయుడు, రమణ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిల్, రబ్బరు, చెక్ మరలు, పెన్నులు, ఎక్కాల పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా పురోభివృద్ధికి నోటు పుస్తకాలు స్టేషనరీని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎం.కె ప్రసాద్, సర్పంచ్ మణి హుస్సేన్, విద్యా కమిటీ చైర్మన్ ధారావత్ రోజా, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మంగతాయాయమ్మ, టీవీ సుజాత, లక్ష్మణరావు పాల్గొన్నారు.



నందిగామ లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణ లయన్స్ క్లబ్ నూతన కమిటీ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. క్లబ్ అధ్యక్షునిగా మాలెంపాటి ప్రసాద్, కార్యదర్శిగా సిహెచ్.శ్రీనివాసరావు, కోశాధికారిగా డాక్టర్ లక్ష్మీ కాంత్ ఎన్నికయ్యారు. లయన్స్ జిల్లా గవర్నర్ వివి ఆంజనేయులు, వైస్ గవర్నర్ ఎన్ ఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్విఎన్ నివతరావు, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ యర్రం రెడ్డి గాంధీ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి


ప్రజాశక్తి - మైలవరం : పర్యావరణం కలుషితం అవకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మైలవరం సర్కిల్ సిఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం శుక్రవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం సమీపంలోని సచివాలయం 3, బైపాస్ రోడ్డు పక్కన 200 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక మొక్కను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా జిఎస్‌టి కోఆర్డినేటర్ కంచర్ల ముత్య ప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం పిఎస్టీలు చనుమోలు నాగభూషణం, పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి


మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో...

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : అల్లూరి సీతారామరాజు త్యాగశీలిని, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివద్ధి కోసం కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి నాయుడు , అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ సత్యనారాయణ , మరియు పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బందరు డిఎస్పి సిహెచ్ రాజా , ఏవో ఎం.ఎం సుబ్రమణ్యం , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు , ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య చిరస్మరణీయులని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ వీసీ హాల్లో స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి, పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమం సందర్భంగా వారి చిత్రపటాలకు జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, కలెక్టరేట్ ఏవో రాధిక, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** దేశ స్వాతంత్రం కోసం తెల్లదొరల గుండెలదరిరేలా పోరాటం చేసి ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు, మన్యందొర అల్లూరి సీతారామ రాజును నేటి తరం ఆదర్శంగా తీసుకుని అన్యాయం, అవినీతి, అక్రమాలపై పోరాటాలు చేపట్టాలని శివాలయం మాజీ చైర్మ న్ చిందా వీర వెంకట కుటుంబరాజు, సీపీఎం నాయకుడు శివనాగేంద్రం పిలుపు నిచ్చారు. అల్లూరి సీతారామరాజు 128వ జయంతి పురస్కరించుకుని కుటుంబరాజు ఆధ్వర్యంలో కాటూరురోడ్డు దళపతి కాంప్లెక్స్ శుక్రవారం ఆయన చిత్రపటానికి పూల మాలవేసి జోహార్లర్పించారు. ఏజీఅండ్స్ జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామ రాజు జయంతి ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ చైర్మన్ సత్తార్, బాపిరాజు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు అల్లూరి చిత్రపటంవద్ద నివాళులర్పించారు. మండలపరిషత్ కార్యాలయంలో అల్లూరి జయంతి నిర్వహిం చారు. సర్పంచ్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఇన్చార్జ్ ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ పూలమాల లు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 జి జగన్ మోహన్ రావు, మండల పరిషత్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలో వివిధ


ఉయ్యూరులో...

రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు, విజయవాడ తూర్పు మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు వంగవీటి మోహన్రంగారావు 78వ జయంతిని నిర్వహించారు. శుక్రవారం టిడిపి కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు వంగవీటి మోహన్రంగా చిత్రపటాలకు ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు కర్ర సుధాకర్ బం డే రాఘవ, పర్చూ రీ దుర్గాప్రసాద్, మండలి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వైసీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రంగా చిత్రపటానికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, రాధా రంగా మిత్రమండలి ది వి యూనిట్ నాయకులు రాజనాల మాణిక్యాలరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, వైసీపీ రాష్ట్ర విభజన విభాగం ప్రచార కార్యదర్శి గాజుల జయ గోపాల్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - పామర్రు :** మండల పరిధి జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయం నందు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుబి. గోపి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రంథాలయ అధికారి వి నాగ సురేష్ ,పాఠకులు, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుడికి వాహనం అందజేత

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : ఇటీవల గోడ కూలి ప్రమాదం బారిన పడి కాలు కోల్పోయిన పేరుబోయిన రామాంజనేయులుకు ఎన్నారై చలమలశెట్టి బాలాజీ త్రిచక్ర వాహనాన్ని ఏర్పాటు చేయగా శుక్రవారం ఉమ్మడి కృష్ణాజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సహకారం అందించి చిరు వ్యాపారం చేసుకునేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రతినిధులు జనసేన పార్టీ నాయకులు ,పుర ప్రముఖులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : రాష్ట్రంలో బడికి వెళ్లే చదువుకునే ప్రతి ఒక్కరికి తల్లికి వందనం పథకం అమలుచేసి న ఘనత కూటమి ప్రభుత్వానిదని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేం ద్ర ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీ 15వ వార్డులో శుక్రవారం సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చే స్తున్న పథకాలు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ పార్టీ అధ్యక్షు డు గుర్నాధరావు, అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, చలపాటి శ్రీను. అప్పలనాయుడు, బూరెల నరేశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - పామర్రు :** ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా పామర్రు తోటలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన సంక్షేమ-అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే వారికి ప్రచార కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కష్ణ జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పట్టణ టిడిపి అధ్యక్షుడు పరస సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మంతెన రామాంజనేయులు పాల్గొన్నారు.

కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జీవితంలో ఉన్నత లక్ష్యం ఎంచుకొని అందుకు అనుగుణంగా సాధన చేసి లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిల్లలకు ఉద్బోధించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం హాలులో ప్రధానమంత్రి కేర్ పథకం కింద కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి బాగోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సంరక్షకులు సరిగా చూసుకుం టున్నారా లేదా, బాగా చదువుతున్నారా లేదా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరాలంటే కష్టపడాలన్నారు. కష్టపడితే ఏమైనా సాధించవచ్చన్నారు. చెడు అలవాట్లకు లోను కాకుండా ఒక లక్ష్యం నిర్ధారించుకుని అందుకు అనుగుణంగా సాధన చేయాలన్నారు. తదుపరి కలెక్టరేట్లోని విసి హాల్లో ఆ పిల్లలు, వారి సంరక్షకులతో కలిసి జిల్లా కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఎంఎన్. రాణి, జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద్ కుమార్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా సమన్వయ అధికారి రవికాంత్, ఐసిడిఎస్ సిడిపిఓ ఇంచార్జ్ మధుబాబు, ఎన్ఐసి పిఓ ప్రశాంతి పలువురు సిడిపివోలు పాల్గొన్నారు.

ఎల్ఐసి పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : సమస్యలు పరిష్కరిం చాలని ఎల్ఐసి జిఐసి పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు శుక్రవారం మచిలీపట్నం డివిజన్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు డివిజనల్ మేనేజర్ సుధాకర్ బాబుకు యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు మాదిరిగా సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు అధికారులు వేతన సవరణ చేసినప్పుడు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు కి కూడా తగిన విధంగా పెంపు ఉండాలన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చులను దష్టిలో పెట్టుకొని ప్రతినెల నగదు మెడికల్ సదుపాయం కల్పించాలని, మేడిక్లెమ్ స్కీమును మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. స్టాక్ మార్కెట్ ఒడిదుడుకుల మీద ఆధారపడిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం మీద జిఎస్టి తొలగించి ప్రభుత్వ



రంగ ఎల్ఐసి ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు పి కష్ణ, ఐసిఆర్ ఈ ఏ ఉపాధ్యక్షులు సిహెచ్ బ్రహ్మయ్య, ఐ సీ ఈ యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి , ఎస్సీ జెడ్ ఐ ఈ ఎఫ్ జాయింట్ సెక్రటరీ కిషోర్ కుమార్, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ డివిజన్ నాయకులు సురేష్ బాబు, ఉమామహేశ్వర రావు, ఎల్ఐసి ఏఓఐ నాయకులు కే రాజారావు పెన్షనర్ల పోరాటానికి మద్దతు తెలిపారు

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- కోడూరు : మండల పరిధిలోని ఊట గుండం గ్రామానికి చెందిన కందుల సురేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీ దివి మార్కెట్ యార్డ్ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, కోడూరు మండలం వైసిపి నేతలతో కలిసి శుక్రవారం పరామర్శించారు. వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు పరిసే.మాధవరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న ప్రసాద్, కోడూరు వన్ ఎంపీటీసీ బడే.హేమ గంగాధర్, మండల ఉపాధ్యక్షులు బండే.నాగరాజు, పలువురు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జాతీయ పతాక రూపశిల్పి కష్ణాజిల్లా ఆణిముత్యం పింగళి వెంకయ్యకు ఉమ్మడి కృష్ణాజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు.పింగళి వెంకయ్య 63వ వర్ధంతిని పురస్కరించుకుని చిలకలపూడి పోలీస్ స్టేషన్ పక్కగా ఏర్పాటుచేసిన పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం బండి రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో పుట్టిన పింగళి వెంకయ్య దేశ స్వాతంత్ర సంగ్రామంలో వారు చేసిన పోరాటాలు త్యాగాలు మరు లేనివని, భారతదేశానికి మువ్వన్నెల జెండాను రూపొందించి అందరి మన్ననలు పొందిన తెలుగువాడు పింగళి వెంకయ్య కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పినిశెట్టి నాగఛాయాదేవి, గడ్డం రాజు, తిరుమలశెట్టిరాజు, ఊచా చంటి, ఎడుంబాకుల వాసు, కూనపురెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే పింగళి వెంకయ్య వర్ధంతిని మచిలీపట్నం లోని పింగళి వెంకయ్య వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సూపర్డెంట్ ఆశాలత, పింగళి వెంకయ్య వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మంజుల, వైద్య కళాశాల సిబ్బంది వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-గన్నవరం : ఆర్టీసీలో పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గన్నవరం ఆర్టీసీ డిపో మెయిన్ గేటు ఎదురుగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రీజినల్ సెక్రటరీ ఎం మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. డిపో కార్యదర్శి టీవీ కోటేశ్వరరావు, డిపో ప్రెసిడెంట్ శ్రీనివా సరావు, వైస్ ప్రెసిడెంట్ పద్మనాబులు, సెక్రటరీ టి. వి. కోటేశ్వరరావు, ట్రెజరర్ యూ.వి.రావు, గ్యారేజీ కార్మికులు నానీబాబు, డ్రైవర్ అసోసియేషన్ సెక్రటరీ కె ఎస్.రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉయ్యూరు డిపో ఉద్యోగు లు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమంలో డిపోగ్యారేజి గేటు ఎదుట ధర్నాచేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వైవీ రావు, కోశాధికారి కేవీ రావు, డిపో అధ్యక్ష కార్యదర్శులు టీవీఎస్ నారాయణ, రవికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్రం నానిపై అసత్యప్రచారాలు తగదు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం రాఖీ అవెన్యూస్(చంద్రిక అయోధ్య) లో ఫ్లాట్ల కోసం బిల్డర్ వేణుకి లక్షల రూపాయలు కట్టి మోసపోతే తమ అందరి అభ్యర్ధన మేరకు వాలంటరీగా గుర్రం నాని ముందుకు వచ్చి ఆధునిక అంగులతో ప్లాట్ల నిర్మాణం పూర్తి చేసి తమకు అందించారని చంద్రిక అయోధ్యలో నివాసముంటున్న 70 ఫ్లాట్ల యజమానులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎంతో ఆనందంగా గృహప్రవేశాలు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ఉంటున్నామని, అయితే బ్యాంకు నుంచి డాక్యుమెంట్ తీసుకొని పారిపోయిన మిలటరీ ఉద్యోగి రవి, అతనికి సహకరించే మరో ఐదుగురు కలిసి రాఖీ అవెన్యూస్ ప్రతిష్టను దెబ్బతీయడానికి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో చంద్రిక అయోధ్యలో ఫ్లాట్ల కోసం రూ. 30 లక్షల నుంచి 60 లక్షల వరకు అప్పటి ఎండి వేణుకి విడతల వారీగా చెల్లించామని, 2021కి మొండి గోడలు కట్టి వేణు చేతులెత్తేశాడడన్నారు. అపార్ట్మెంట్ కు ఎక్కువగా భూములు ఇచ్చిన రైతుల్లో గుర్రం నాని ఉన్నారనీ, ఆయన దగ్గరకు వెళ్లి ఫ్లాట్లు కట్టించి ఇవ్వమని అభ్యర్థిస్తే మొత్తం 670 ఫ్లాట్లు ఉంటే అందరికీ ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఇదిలాగుంటే మిలటరీ ఉద్యోగి రవి, అతనికి సంబంధించిన మరో ఐదుగురు కలిసి గహాల్లోకి రాకపోగా, మెయింటినెన్స్ కింద ఇవ్వాల్సిన నెలకు 2000 రూపాయలు చొప్పున 48 వేలు ఇవ్వకుండా ఎగవేశారన్నారు. ఆ డబ్బులు ఇవ్వమని నాని అడిగినందుకే తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి కొన్ని (ప్రజాశక్తి కాదు) పేపర్లలో అసత్యాలు రాయిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఏవిఎస్ఎస్ఎం రాజు, మోహన్ కుమార్, డి సి హెచ్ పుల్లయ్య, రాధాకష్ణ, వర్మ, పెద్దినేని పార్వతి, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజు



ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎంపి కేశినేని, ఎంఎల్ఎ బోడే

ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఫోటోలు కేవలం ఓ సంఘటనను గుర్తుంచుకునే సాధనమే కాదు, తరతరాల వరకు గుర్తుండిపోయే చారిత్రక దృశ్యం అని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్ అన్నారు. ఫొటో అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఓ ముఖ్యమైన భాగమని చెప్పారు. అనేక కార్యక్రమాల్లో ఫొటోగ్రాఫర్ పాత్ర చాలా కీలకమని చెప్పారు. విజయవాడ కానూరులో ఎపి ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటో ట్రేడ్ షో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, బీజేపీ నేత బబ్బూరి శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి, అక్కడ ప్రదర్శించబడిన కెమెరాలు, ఫొటో పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోటో అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఓ ముఖ్యమైన భాగమన్నారు. ప్రతి రోజు జరిగే ఎన్నో కార్యక్రమాల్లో ఫొటోగ్రాఫర్ పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని చెప్పారు. ఇలాంటి ట్రేడ్ షోలు ఫోటోగ్రాఫర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వెల్లడించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఫొటో ట్రేడ్ షోను ఫొటోగ్రాఫర్లకు పండుగలాంటిదన్నారు. సుమారు అన్ని ప్రముఖ కంపెనీలు వారు పాల్గొన్నారని చెప్పారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అత్యాధునిక కెమెరాలు, లెన్సులు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మహిళ మెడలో బంగారు నానుతాడు లాక్కెళ్లిన దుండగులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని కుదప గ్రామంలో మహిళ మెడలో ఉన్న బంగారపు నాంతాడు బలవంతంగా లాక్కెళ్లి సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే కుదప గ్రామానికి చెందిన బలగాని జమలమ్మ అనే మహిళ శుక్రవారం గేదెలు మేపుకుంటూ ఉండగా ఉదయం 11 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఎరుపు రంగు గ్లామర్ బైక్‌పై వచ్చి తుమ్మలపల్లి రాఘవయ్య పొలం ఎక్కడ అంటూ జమలమ్మ మైండ్ డైవర్ట్ చేసి ఆమె మెడలో ఉన్న బంగారపు నాంతాడును లాక్కొని బైక్‌పై పరారయ్యారని ఆమె తెలిపారు. నిందితులు ఇద్దరిలో ఒకరు నీలి షర్టు, టోపీ ధరించాడనీ, మరొకడు ఎరుపు టీషర్టు ధరించాడనీ, ఈ ఇద్దరూ రుద్రవరం వైపు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఏదైనా సమాచారం ఉంటే 9490617904 లేదా 9154880480 నెంబర్లకు తెలియజేయాలని రెడ్డిగూడెం పోలీసులు తెలిపారు.



సిసి కెమెరాకు చిక్కిన చోరుల చిత్రం

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర బృందం

ప్రజాశక్తి,- విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రి పై కొలువైన కనకదుర్గమ్మను శుక్రవారం సాయంత్రం కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ అధికారుల బృందం దర్శించుకుంది. మనీష్ ఠాకూర్ – కేంద్ర అదనపు కార్యదర్శి సారధ్యంలో కేంద్ర అధికారులను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ దేవస్థానానికి తోడ్కొని వచ్చారు. కేంద్రబృందాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్ స్వాగతించి, దర్శనం కల్పించి, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్‌పై ఎసిపికి ఫిర్యాదు

విజయవాడ : శాతవాహన కళాశాలలో ఎయిడెడ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ జీతాలు పొందుతున్న తమ తప్పుడు సంతకాల దరఖాస్తులు, నకిలీ మనుషుల్ని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులకు చూపించి సరెండర్ చేస్తున్నట్లు అక్రమంగా తొలగించే కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ ప్రయత్నాలు చేస్తున్నారని కళాశాల సిబ్బంది నగర ఎసిపి కె.పవన్ కుమార్‌కు శుక్రవారం నేరపూరిత, నమ్మకద్రోహం, బ్లాక్ మెయిల్ నేరాల కింద ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ద్వారం వద్ద ఆందోళన నిర్వహించారు. పూర్వ ప్రిన్సిపాల్ ప్రస్తుత భౌతిక శాస్త్ర అధ్యాపకులు జెవి.సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి వచ్చే నగదు విషయంలో బ్లాక్ మెయిల్ చేయడం లంచం తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ కరస్పాండెంట్‌ల మీద అనేక ఫిర్యాదులున్నాయన్నారు. ప్రస్తుతం జూన్ నెల అందవలసిన జీతాలు అందకుండా బిల్లు ఏమైందో తెలియని అయోమయంలో ఉన్నామని గత ఏడాది నుంచి చదువుకున్న విద్యార్థులకు ఫోన్‌లు చేసి కళాశాలను తీసి వేశామన్నారు. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ లు ఫలానా ప్రదేశానికి వచ్చి తీసుకోవాలని వారిలో భయాందోళనకు గురి చేస్తున్నారని వివరించారు. వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన తమకు న్యాయం చేయాలని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల భవితను కాపాడాలని కోరారు. కళాశాల బోధనా బోధనేతర సిబ్బంది సంగీతరావు, బ్రహ్మయ్య, యశోద, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కళాశాల సిబ్బంది

అందరికీ న్యాయం : ఆర్‌డిఒ చైతన్య

ప్రజాశక్తి - మైలవరం : రహదారి విస్తరణలో నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని ఆర్‌డిఒ కావూరి చైతన్య హామీ ఇచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సిపిఎం నాయకులు, బాధితులతో చర్చించారు. 2016–17 సంవత్సరంలో మైలవరం నుండి నూజివీడు వరకు రహదారి విస్తరణలో వెల్వడం, చంద్రాల గ్రామాలకు చెందిన నిర్వాసితులు తమ ఇళ్ళను కోల్పోయారు. నష్టపరిహారం ఇస్తామని చెప్పిన అధికారులు పత్తా లేకుండా పోయారు. పదేళ్లు అవుతున్న బాధితులకు నష్టపరిహారం రాలేదు. సిపిఎం బాసటగా నిలిచి అనేకసార్లు రాస్తారోకో, నిరసనలు చేపట్టి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో కొంతమందికి నష్టపరిహారం అందింది. మరి కొంతమందికి రాకపోవటంతో ఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో బాధితులతో కలసి చంద్రాలలో నిరసన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న మైలవరం తహశీల్దార్ అబ్దుల్ దరియా కొంత సమయం ఇవ్వాలని ఆర్డీవోను మైలవరం తీసుకువచ్చి బాధితులతో మాట్లాడిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. శుక్రవారం మైలవరం వచ్చిన ఆర్డీవో చైతన్య బాధితులు, నాయకులతో చర్చించి సానుకూలంగా స్పందించి త్వరలోనే అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు, మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, బాధితులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ చైతన్యను కలిసిన సిపిఎం నాయకులు

ఐటిఐ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీ కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన జిల్లాల్లో ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని.. ఐటీఐ ఉద్యోగులు, సిబ్బంది సమర్ధవంతమైన సేవలందించడం ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ, డి ఎల్ టి సి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం నగరంలోని గురునానక్ కాలనీలో గల శుభలగ్న వేదిక ఫంక్షన్ హాల్ లో సంఘ అధ్యక్షులు పుట్టగుంట రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేశినేని చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 84 ఐటీఐ, డీఎల్‌టీసీలలో వేలాది మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. 700 మందికిపైగా అధ్యాపకులు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఐటీఐ కళాశాలల్లో శిక్షణ పొందిన ప్రతి విద్యార్థి ఉద్యోగావకాశం పొందేలా నైపుణ్యంగల శిక్షణను అందించాల్సిన అవసరముందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక పరిశ్రమలను ప్రోత్సహించనున్న నేపథ్యంలో ఉద్యోగావకాశాలు మెండుగా లభించే అవకాశముందన్నారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యారంగంలో ఐటీఐలకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని.. వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక, పారిశ్రామిక శిక్షణను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేసినట్లు తెలిపారు. త్వరలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. అనంతరం ఇటీవల జేఏసీ ఛైర్మన్‌గా ఎన్నికైన ఎ.విద్యాసాగర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన డీవీ రమణను ఎంపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ జాయింట్ డైరెక్టర్ జి.బాలసుబ్రహ్మణ్యం, ఏపీ గవర్నమెంట్ ఐటీఐ, డీఎల్‌టీసీ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.వెంకట రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి కె.రత్నరాజు, కోశాధికారి కేఎస్ శ్రీనివాసరావు, ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు డీఎస్ఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న ఎంపి, తదితరులు

ఒప్పో ఇండియా నుంచి రెనో 14 సిరీస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఒప్పో రెనో14 సిరీస్‌ను ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఫీచర్‌లో పనితీరు, శక్తి, ఖచ్చితత్వాన్ని కోరుకునే వినియోగదారులకు పూర్తి స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని అందిస్తుంది.అని తెలిపారు .రెనో14, రెనో14 ప్రోతో, ఒప్పో వినియోగదారులు తమ జీవితాలను ఎలా సంగ్రహించాలో, సవరించాలో, పంచుకోవాలో మారుస్తుంది. అని తెలిపారు .ఈ స్మార్ట్‌ఫోన్‌లు లాస్‌లెస్ 3.5 ఎక్స్ ఆప్టికల్ జూమ్ ప్లస్ 120 ఎక్స్ వరకు డిజిటల్ జూమ్, అధునాతన ఏఐ ఎడిటింగ్ సాధనాలు, నీటి నిరోధక మన్నికను ప్రతి జీవనశైలికి అనుగుణంగా శక్తివంతమైన ఆల్–రౌండర్‌గా అనుసంధానిస్తాయిఅని తెలిపారు. వినియోగదారులు మొదటి అమ్మకాల కాలంలో రూ. 34,200 నుండి ప్రారంభమయ్యే రెనో14 సిరీస్‌ను నికర ప్రభావవంతమైన ధరగా పొందవచ్చు.అని తెలిపారు.



బ్రహ్మేశ్వరరావుకు బెస్ట్ ఎన్‌సిసి ఆఫీసర్ అవార్డు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కొత్తపేట ఎస్‌కె పివివి హిందూ హైస్కూల్ ఎన్ సిసి ప్రథమ ఆఫీసర్‌గా పని చేస్తు న్న బి.బ్రహ్మేశ్వర రావు యూనిట్ బెస్ట్ అసోసియేట్ ఎన్సిసి ఆఫీ సర్‌గా ఎంపి కైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యా యులు కె.శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో హిందూ హైస్కూల్ ఎన్ సిసి విద్యార్థులు నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలు, డ్రిల్, సాంస్కృతిక రంగాల్లో సాధించిన ప్రగతికి గానూ బెస్ట్ ఎన్‌సిసి ఆఫీసర్ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. 8 'ఏ' ఎయిర్ స్క్వా డ్రన్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ అజిత్ సింగ్ రాఠి అవార్డు ప్రటించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 2న విఆర్ సిద్దార్థ కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఎయిర్ కొమడోర్ నర్సింగ్ షైలాని చేతుల మీదుగా తమ పాఠశాల ఎన్‌సిసి ఆఫీసర్ మెడల్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌కె పివివి హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి తొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, పాఠశాల కార్యదర్శి కె.ఎల్ వి.మోహన్‌రావు, పాఠశాల సిబ్బంది బ్రహ్మేశ్వరావుకు అభినందనలు అందజేసినట్లు తెలిపారు.

తిరువూరు విద్యార్థులకు జాతీయ స్థాయి ఘనత

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఘనత సాధించినట్లు ప్రిన్సిపల్ కె.నరసింహారావు తెలిపారు. ఢిల్లీకి చెందిన ఇండియన్ ఒలంపియాడ్ సభ్యులు తమ పాఠశాలలో జాతీయస్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ పోటీలో 8వ తరగతి విద్యార్థి భవ్య శ్రీరెడ్డి 7వ ర్యాంకును సాధించి రూ.500 నగదు బహుమతి, మెడల్, మెమెంటో సర్టిఫికెట్ అందుకున్నట్లు చెప్పారు. సైన్స్ టాలెంట్ పోటీ పరీక్షలో ఐదో తరగతి విద్యార్థి ఎండి.షఫీ ఉల్లా 9వ ర్యాంకు సాధించి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ కైవసం చేసుకున్నాడన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు, చైర్మన్ హనుమంతరావు, డైరెక్టర్లు కె.శేషగిరిరావు, టి.సూరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ కె.సురేష్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

